క్లుప్తంగా

ఏంపీడీఓ బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: సీతానగరం ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ 6 నెలల శిక్షణ కోసం వెళ్లిన బి.కృష్ణ మహేష్ రెడ్డి మంగళవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా అందరికీ ఆరోగ్యభద్రత కల్పించడానికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. అలాగే గ్రామాల్లో సచివాలయాల వారీగా వైద్య నిపుణులతో కూడిన వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తుందని, రోగులందరికీ ఇళ్లవద్దనే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎఫ్ఏ-2 పరీక్షలు ప్రారంభం



బలిజిపేట పాఠశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: ఎఫ్ఏ-2 పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సామల సింహాచలం తెలిపారు. మండలంలో 42ప్రాథమిక, 4యూపీ, 8ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 4వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, నియమ నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహిస్తున్నదీ లేనిదీ పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



టెంకాయ కొట్టిన ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలో బలిజిపేట ఉన్నత పాఠశాల నుంచి కళింగ వైశ్య కల్యాణ మంటపం వరకు నూతన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జోగారావు మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.20లక్షలతో 500మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అగ్ని అస్త్రం, జిల్లేడు ద్రావణం తయారీ



బర్లిలో తయారుచేస్తున్న ద్రావణం

బలిజిపేట: మండలంలోని బర్లి, సుభద్ర, వెంగళరాయపురం గ్రామాల్లో దోమ నివారణకు అగ్నిఅస్త్రం, జిల్లేడు ద్రావణం తయారీ, వాటి వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం అవగాహన నిర్వహించారు. పచ్చపురుగు, కత్తెర పురుగు నివారణ కోసం వినియోగించే అగ్నిఅస్త్రం, పొటాష్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించే జిల్లేడు ద్రావణం, తూటికాయ కషాయాన్ని రైతులతో తయారుచేయించి వినియోగంపై ఎంసీఆర్‌పీ లక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.

నిడగల్లులో వైద్యశిబిరం ఏర్పాట్ల పరిశీలన



వైద్యశిబిరం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని నిడగల్లులో వైద్యశిబిరం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఏఓ ఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఉచితవైద్యశిబిరం ఏర్పాట్లను వైస్‌ఎంపీపీ టి.సూర్యనారాయణ, సర్పంచ్ ఆర్.ఆరుద్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు జి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ రాధాకాంత్, వైద్య సిబ్బంది, గ్రామవలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖర్చు లేకుండా వైద్యసేవలు

- ఎమ్మెల్యే జోగారావు



వెంగాపురంలో శిబిరం వద్ద వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ పైసా ఖర్చు లేకుండా వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని వెంగాపురంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా 7రకాల పరీక్షలు నిర్వహించి, అందుకు తగిన వైద్య సేవలు అందించడంతో బాధితుడిని సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తయారుచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తోందన్నారు. ప్రతి కుటుంబాన్ని సర్వే చేయించి కుటుంబంలో ఎవరికి ఎటువంటి వ్యాధులు ఉన్నా తగిన వైద్య సేవలందిస్తుందని చెప్పారు. 151రకాల మందులు అవసరమైన రోగులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎంత ఖర్చు పెట్టేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక భారంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఏ ఒక్క కుటుంబానికీ రాకూడదనే ఉద్దేశంతో సీఎం జగన్మోహన్ రెడ్డి పేదలకు ఆరోగ్యభరోసా కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారన్నరు. ఈ పథకాన్ని 5దశల్లో నిర్వహించే విధంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పరిశీలించిన కలెక్టర్

వెంగాపురంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష పథకాన్ని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పర్యవేక్షించారు. శిబిరంలో 300మంది రోగులకు కంటి, ఆర్థోపెడిక్, ఆప్తాలమిక్, చర్మవ్యాధి నిపుణులు, సాధారణ సేవలు అందించే వైద్యులు శిబిరంలో వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు, సర్పంచ్ జి.అమ్మడమ్మ, ఎంపీటీసీ మురళి, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు సాయిరాం, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, కార్యదర్శి వెంకటి నాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: జగనన్న ఆరోగ్య సురక్షపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అందరికీ ఆరోగ్య భద్రత

సీతానగరం: ప్రజలందరికీ ఇళ్లవద్దనే ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా వైద్య సేవలందించి ఆరోగ్యభద్రత కల్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ముఖ్యోద్దేశమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని అంటిపేట సచివాలయం పరిధిలోఉన్న ప్రాథమికపాఠశాలలో వైద్యులు, అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీస్తూ అందరికీ ప్రభుత్వం ఉచితంగా ఆరోగ్య పరీక్షలతో పాటు మందులు అందజేస్తుందని, ఇక్కడ నయం కాని అనారోగ్య సమస్యలకు పెద్ద ఆస్పత్రులకు రిఫర్‌చేసి ఎంత ఖర్చయినా పూర్తిగా ప్రభుత్వమే భరించి ఉచిత వైద్యం అందించనుందని తెలిపారు. కార్య క్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఈశ్వర నారాయణ,వై.గోపాలనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, ఉపసర్పంచ్ బి.తిరుపతి రావు, ఎంపీటీసీ ఎస్.నిర్మల, స్టేట్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, తహసీల్దార్ ఎన్వీరమణ, మండల ఏఓ ప్రసాద్, వైద్యాధికారులు, ఐసీడీఎస్ పీఓ సుగుణ, వైద్యసిబ్బంది, పంచాయితీ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

జీగిరాంలో 'ఆరోగ్య సురక్ష'

సాలూరు: మండలంలోని జీగిరాం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజలకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్‌ఓ శివకుమార్, ఎంపీడీఓ పార్వతి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మక్కువ: పార్టీలకతీతంగా ప్రతీ గడపకూ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని శంబర గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని యాదవవీధి, బీసీకాలనీ, జన్నివీధి తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ మేరకు లబ్ధిదారులకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి పథకాలు ఎందుకు అందడం లేదో సంబంధిత శాఖ అధికారులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సీసీరోడ్లు వేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, పింఛన్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరగా, ఆయా శాఖల అధికారులకు సమస్యలు పరిష్కరించాలని రాజన్నదొర ఆదేశించారు. గిరిశిఖర గ్రామమైన బీరమాసి గ్రామానికి చెందిన గిరిజనులు రహదారి వేయాలని రాజన్నదొర దృష్టికి తీసుకురాగా, రహదారి ఏర్పాటుకు ఆయన హామీ ఇచ్చారు. సర్పంచ్ సింహాచలమమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీడీఓ సిహెచ్.సూర్యనారాయణ, ఎంఈఓ సత్యానారాయణ, వెలుగు ఏపీఎం సన్నిబాబు, ఏఓ శ్రీనివాసరావు, ఏపీఓ ఈశ్వరమ్మ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయుకులు పెంట సంజీవునాయుడు, పెంట జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు వద్దు-కషాయం శ్రేష్టం



ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ చేస్తున్న ఏపీసీఎన్ఎఫ్ టీం ప్రతినిధులు

సీతానగరం: రసాయన ఎరువు రహిత పంటలనే రైతులు పండించి ఆరోగ్య పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఏపీసీఎన్ఎఫ్ ప్రతినిధి వై.శ్రీరాములు కోరారు. ఈ మేరకు మండలంలోని నీలకంఠాపురంలో ఉపసర్పంచ్ ఆర్.రాము, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వై.గోపాలనాయుడు ఆధ్వర్యంలో ఏపీసీఎన్ఎఫ్ టీం సభ్యులు రైతులతో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఏపీ(ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్) సీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో పెట్టుబడి లేని ప్రకృతివ్యవసాయంలో భాగంగా రసాయన ఎరువుల వాడకం వల్ల నష్టాలు, భూమాత ఆరోగ్యం చెడి పోవడం, తద్వారా ప్రజలకు కలిగే నష్టాల గురించి తెలియజేస్తున్నామన్నారు. ఈ మేరకు రైతులకు ప్రకృతి వ్యవసాయం సాగు గురించి అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా కషాయాల వాడకం, భూసారాన్ని పెంపొందించడం కోసం, నవధాన్యాలు వేయడం, ప్రతి ఇంటా పెరటి కూరగాయలు పండించి వినియోగించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామవలంటీర్లు, మహిళా రైతులు, స్వచ్ఛంద సేవాకార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేట పీహెచ్‌సీ పరిశీలన



వైద్యాధికారులతో మాట్లాడుతున్న బృందం అధికారి

బలిజిపేట: జాతీయ నాణ్యతా ప్రమాణాల పరిశీలన బృందం బలిజిపేట పీహెచ్‌సీని మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించింది. నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ కేంద్రం వైద్యాధికారి నితిన్‌దత్ భరద్వాజ్, నిమిత్ ఎస్ కుబావత్‌లు పీహెచ్‌సీలో జాతీయ నాణ్యతా ప్రమాణాలు ఏమేరకు అమలవుతున్నాయనేది గుర్తించారు. సిబ్బంది నైపుణ్యం తదితర అంశాలపై పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసూతిగది, ల్యాబ్, వార్డు ఫార్మసీ, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జరుగుతున్న తీరు మొదలైన వాటిని నిశితంగా పరిశీలించారు. సంబంధిత రికార్డులు, వైద్యసిబ్బందికి ఆరోగ్య కార్యక్రమాలపై ఉన్న నైపుణ్యం, పరిజ్ఞానం పరిశీలించారు. ప్రతిరోజూ నమోదవుతున్న ఓపీ, ఐపీ వివరాలను తెలుసుకున్నారు. ప్రసవాలు, నిర్ధారణ పరీక్షలు, మందుల వినియోగం వాటి నిర్వహణ రికార్డులు, పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. వాటి ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు బృందం తెలిపింది. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహన్‌రావు, వైద్యాధికారిణి కిరణ్మయి, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాల అమలును ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, పథకాల మంజూరు, వాటి అమలును, గత ప్రభుత్వ పనితీరుతో పోల్చుతూ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేటలోని కళింగ వైశ్య కల్యాణమంటపంలో ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలనే అంశంపై ఈనెల 11నుంచి నిర్వహించనున్న కార్యక్రమంపై వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వాటితో ప్రజలకు ఎటువంటి మేలు జరుగుతోందో వివరించాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఉద్యోగ నియామకాలు వంటి అంశాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ నెల 11 నుంచి వచ్చేనెల 17వ తేదీ వరకు 45రోజులు ఈ కార్యక్రమం నిర్వహణ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాఘలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు ఎం.దుర్గేశ్వరి, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు జి.శ్రీరాములునాయుడు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన గృహసారథులు, కన్వీనర్లు, నాయకులు

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు

సాలూరు: పట్టణంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. రక్తదాన శిబిరానికి ప్రత్యేక అతిథిగా ఆర్‌డీఓ హేమలత హాజరయ్యారు. 68 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు అగ్ని మాపక శాఖాధికారి సుధాకర్‌రావు తెలిపారు. వైద్యారోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



వలంటీర్ సాయిని పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: మండలంలోని శంబర గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ నైధానసాయి రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై మంచాన పడ్డాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు వలంటీర్ సాయి మంగళవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. సాయి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

పేదలకు డీ పట్టాల పంపిణీ



డీ పట్టాలు పొందిన లబ్ధిదారులతో డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: మండలంలోని శంబర గ్రామానికి చెందిన పేద రైతులకు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర డీ పట్టాలు మంగళవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన అయిదుగురు రైతులకు డీ పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలను అన్ని విధాలుగా ఆదుకోవాలనే ఉద్దేశంతో ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులకు కొండపోడు, డీ పట్టాలు అందిస్తుందన్నారు. పట్టాలను ఆన్‌లైన్ జరిపిస్తే, ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా పథకం వర్తిస్తుందన్నారు. పేదల పక్షాన నిలబడే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని, పేదల అభ్యున్నతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, పోలమాంబ అమ్మవారి ఆలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, అల్లు వెంకటరమణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నల్ల జెండాలతో నిరసన



బలిజిపేటలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

బలిజిపేట: అక్టోబరు 3, 2021లో లఖింపూర్ ఖేరీ రైతాంగ ప్రదర్శనలో నలుగురు రైతులను కాన్వాయి వాహనాలతో తొక్కించి చంపిన కేసులో నిందితులైన బీజేపీ నాయకులను పదవులనుంచి తప్పించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బలిజిపేటలో గాంధీవిగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు మంగళవారం నల్ల జెండాలు పట్టుకుని నిరసన తెలియజేశారు. కేంద్ర డిప్యూటీ హోంశాఖ మంత్రి అజయ్ మిశ్రా, కుమారుడు ఆశిష్ మిశ్రాలను పదవులనుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. నిందితులైన బీజేపీ నాయకులపై చర్యలు చేపట్టకుండా, మృత్యువాత పడిన రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం, సీఐటీయూ, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో పింఛన్ అందజేత



విశాఖ కేజీహెచ్‌లో పైడితల్లికి పింఛను అందజేస్తున్న వలంటీర్ సత్యవతి

మక్కువ: మండలంలోని కొండబుచ్చెంపేట గ్రామానికి చెందిన పింఛనుదారు పైడితల్లి అనారోగ్యం బారిన పడటంతో విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతుంది. మంగళవారం గ్రామ వలంటీర్ ఎజ్జల సత్యవతి విశాఖపట్టణం కేజీహెచ్‌కు వెళ్లి పైడితల్లికి పింఛను సొమ్మును అందించడంతో పింఛనుదారు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపింది.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ, జడ్పీ వైస్ చైర్మన్ ఇతర ప్రజా ప్రతినిధులు

పాచిపెంట: ప్రజారోగ్యమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తుందని, ఎంపీపీ బడ్నాన ప్రమీల, జడ్పీ వైస్ చైర్మన్ కొరాన్ని సింహాచలం అన్నారు. మండలంలోని కేరంగి పంచాయతీ నందేడువలసలో మంగళవారం స్థానిక సర్పంచ్ సోముల లచ్చయ్య ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన బాధ్యతలు చేపట్టిన తర్వాత నాడు నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మారుస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొట్టాపు ముత్యాల నాయుడు, వైస్ ఎంపీపీ కొరుపల్లి రవీంద్ర డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివకుమార్, పాచిపెంట గురువు నాయుడుపేట స్థానిక వైద్యాధికారులు, స్థానిక ఎంపీటీసీ డోనరు సీతమ్మ, నాయకులు డోనేరు లచ్చయ్య, రామయ్య పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

బొబ్బిలి: మండలంలోని వాకాడ వలస వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో కలువరాయి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న రాముడు వలసకు చెందిన సురగాల మోహనరావు, పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం బర్లి నుంచి ఎదురుగా వస్తున్న రామచంద్రరావుకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి వైద్య చికిత్స అందజేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

రాజాం సిటీ: మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ మంగళవారం తెలిపారు. స్థానిక వాసవీనగర్‌లో నివాసముంటున్న ఓ మహిళను తెర్లాం మండలంలోని కాగాం గ్రామానికి చెందిన జిల్లెల రాజేంద్ర ప్రతిరోజూ వెంటపడి వేధిస్తున్నట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దిశ యాప్‌పై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై లావణ్య

పార్వతీపురంటౌన్: దిశ యాప్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరని దిశ సెల్ ఎస్సై లావణ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె పట్టణంలోని సురేష్ స్కూల్‌లో దిశ యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు దిశ ఎస్ఓఎస్ యాప్ ఉపయోగపడే విధానాన్ని స్వయంగా వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళ తన రక్షణకు తప్పనిసరిగా స్మార్ట్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ఈ యాప్ వల్ల అరికట్టవచ్చునన్నారు. విద్యార్థులంతా తమ తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.